క్లుప్తంగా

ఇంగ్లిష్ భాషలో పట్టు సాధించాలి

మరికల్: విద్యార్థులు ఇంగ్లీష్ భాషలో పట్టు సాధించడం వల్ల భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని వేసవి శిబిరం నిర్వాహకులు అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఇబ్రహీంపట్నంలో ఛత్రపతి శివాజీ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోకెన్ ఇంగ్లీష్ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏటా వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేసి వారి భవిష్యత్తుకు బాటలు వేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఇంగ్లీష్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో రఘు, నాగరాజ్, కృష్ణ, శివ, పవన్, అశోక్, శ్రీకాంత్, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

స్థానిక యువకులకు అవకాశం కల్పించాలి



కృష్ణా: మండలంలోని హిందుపూర్ గల ఇథనాల్ ఫ్యాక్టరీలో పని చేయుటకు స్థానిక నిరుద్యోగ యువకులకు అవకాశం కల్పించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్‌కుమార్ దీక్షిత్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఇథనాల్ ఫ్యాక్టరీతో పాటు ఇతర నిర్మాణంలో ఉన్న కంపెనీల్లో కూడ మొదట స్థానికులకు అవకాశం కల్పించాలని కంపెనీ యాజమాన్యానికి ఓ ఉత్తరం అందించినట్లు తెలిపారు. నిరుద్యోగ యువకులు ఈ విషయంపై తనను కలవడంతో ఈ విషయంపై యాజమాన్యాన్ని శాంతియుతంగా విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



దామరగిద్ద: మండల కేంద్రంలోని రెయిన్ బో పాఠశాలలో ఆదివారం సంక్షమ్ అంధత్వ నివారణ సంస్థ, సంక్షమ్ స్వచ్ఛంద శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా సంక్షమ్ జిల్లా కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్ మాట్లాడుతూ మొత్తం 88 మందికి పరీక్షలు నిర్వహించగా 41 మందికి కంటి సమస్యలు గుర్తించామన్నారు. వీరికి ఆపరేషన్ అవసరం పడడంతో హైదరాబాద్‌లోని శంకర కంటి ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సంక్షమ్ జిల్లా కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, మండల కార్యదర్శి మాణిక్, సంయుక్త కార్యదర్శి సతీష్‌కాంబ్లే పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు



ఊట్కూరు: ఊట్కూరు శివారులోని ఆగారం వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని రైతులు బోయిని పెద కిష్టయ్య, రాజు తదితరులు ఆరోపించారు. రాత్రి వేళల్లో విచ్చలవిడిగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని ఆదివారం వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయమై పలుమార్లు పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

రహదారుల నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

అమరచింత: ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య విమర్శించారు. మండలంలోని కిష్టంపల్లిలో ఆదివారం ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. కార్యక్రమం అనంతరం మిట్టనందిమళ్ల, ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లె, చంద్రఘడ్ నుంచి నందిమల్ల, ధర్మాపురం రోడ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లకు నిధులు ఇచ్చామని, పనులు చేపడుతున్నామని నాయకులు ప్రకటనలు ఇస్తున్నారు తప్పా రోడ్డు పనులు జరగడం లేదన్నారు. అతుకుల రోడ్లపై ప్రయాణం భారంగా ఉందని, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని వెల్లడించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రహదారి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లతో పొంచి ఉన్న ముప్పు



కోల్పూర్ సమీపంలో ఇటీవల మృతి చెందిన మూడు ఎద్దులు (ఫైల్)

- బలవుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు

మాగనూర్: మాగనూర్ మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు రక్షణ కంచె లేకపోవడం ఆపై వర్షాలతో విద్యుత్ షాక్‌కు గురై మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. లోవేల్టేజీ సమస్యను నివారించడానికి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు వాటి చుట్టు రక్షణ ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మాగనూర్ పట్టణం, వర్కూర్, గురువలింగంపల్లి, నెరడగం, ఉజ్జెల్లి, బైరంపల్లి, వడ్వాట్, అడవిసత్యారం, కోల్పూర్, మందిపల్లితో పాటు పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. మండలంలోని కోల్పూర్ గ్రామ సమీపంలో మూడు రోజుల క్రితం పశుగ్రాసం కోసం వెళ్లిన మూడు ఎద్దులు ట్రాన్స్‌ఫార్మరును తాకడంతో అక్కడిక్కడే మృతి చెందాయి. అనేక చోట్ల ఇలా గేదెలు, మేకలు, ఎద్దులు మృతి చెందుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లను గద్దెలపై నిర్మిస్తున్నప్పటికీ పాత వాటిని మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



గతంలో రక్షణ కంచె ఏర్పాటు చేసే అవకాశాలు ఉండేవి. అయితే కంచెల ఏర్పాటులో అవినీతి జరగడంతో వాటి స్థానంలో దిమ్మెలు ఏర్పాటు చేసి వాటిపైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసేందుకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే చర్యలు తీసుకుంటాం.

–గంగాధర్‌రావు, విద్యుత్‌శాఖ ఏఈ, మాగనూర్

రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలి



ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు రక్షణ కంచె లేకపోవడంతో మేత కోసం అటువైపు వెళ్లిన మూగజీవాలు కరెంట్ షాక్‌కు గురై చనిపోతున్నాయి. వర్షాకాలంలో పరిస్థితి మరింత భయంకరంగా ఉంటుంది. రోడ్ల ప్రక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లతో వాహనదారులు కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– రాఘవేంద్ర, రైతు, మాగనూర్

రూ.50 వేల విలువైన ఆవు మృతి..

మాది పెగడబండ గ్రామం. మేము వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాం. ఇటీవల పశువులను పొలం దగ్గర కట్టేయగా ఓ ఎద్దు విద్యుత్ వైర్ తగిలి మృతి చెందింది. విద్యుత్ వైర్లు సరిచేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు కంచె ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో వ్యవసాయానికి ఆధారమైన ఎద్దు మరణించింది. మరణించిన ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుంది. ఎద్దు మరణించిన తమకు ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి సాయం అందలేదు.

–రాము, పెగడబండ

రేపు విద్యార్థులకు ప్రోత్సాహకాల అందజేత



కార్యక్రమంలో పాల్గొన్న ముదిరాజ్ యూనియన్ సభ్యులు

నారాయణపేట ఎడ్యుకేషన్: ముదిరాజ్ విద్యార్థులందరూ విద్యా పరంగా ముందుకెళ్లాలని నారాయణపేట జిల్లా ముదిరాజ్ అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్, పట్టణ అధ్యక్షుడు బాపన్‌పల్లి వెంకటయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక విజయ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని స్థానిక అభినందన గార్డెన్‌లో ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాలలో 500లకు పైగా మార్కులు సంపాదించిన ముదిరాజ్ విద్యార్థులకు మెమెంటో, ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. అదే విధంగా ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాలలో 400లకు పైగా మార్కులు సంపాదించిన వారికి, ద్వితీయ సంవత్సర ఫలితాలలో 900 పైగా మార్కులు పొందిన వారికి మెమెంటో పాటు ప్రశంశ పత్రం అందజేస్తామన్నారు. కావునా ఈ అవకాశాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న అందరూ ముదిరాజ్ విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు, ఆర్‌టీఓ డైరెక్టర్ పోషల్ రాజేష్, బాల్‌రాజ్, శేషప్ప, జనార్ధన్, రఘు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను వినియోగంలోకి తేవాలి



శ్మశాన వాటికలో పశువులను కట్టేసిన గ్రామస్తులు

మాగనూర్: మండంలోని అనేక గ్రామాలలో శ్మశాన వాటికలకు సరైన స్థలం లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే మాగనూర్ మండలం నేరడగం గ్రామంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేసినా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అది కాస్త పశువుల అడ్డగా మారిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడం ఊరికి దూరంగా శ్మశాన వాటిక ఏర్పాటు చేయడంతో రైతులు దానిని పశువులను అడ్డగా మార్చుకొని కొందరు పశువులను కటేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటికను వినియోగంలో తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

25 ఏళ్ల తర్వాత కలుసుకొన్న విద్యార్థులు



కోటకొండ జడ్పీ స్కూల్లో కలుసుకొన్న విద్యార్థులు



పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ జెడ్పీ స్కూల్లో 1999- 2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు దాదాపుగా 25 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం అకాల మరణం చెందిన నారాయణ అనే స్నేహితుడు కుటుంబానికి రూ.50వేలు నగదు సాయం అందజేశారు.

ఆత్మీయ సమ్మేళనం

పట్టణంలోని మార్కెట్ లైన్ ప్రభుత్వ పాఠశాలలో 1999–2000 చదువుకున్న టెన్త్ క్లాస్ బ్యాచ్ సిల్వర్ జూబ్లీ కళాశాలలో గెట్ టు గెదర్ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మిత్రులందరూ కలుసుకొని ఒకరి బాగోగులు ఒకరు తెలుసుకున్నారు. అలాగే అలనాటి ఉపాధ్యాయులను సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకొన్నారు.

పూర్వ విద్యార్థుల రక్తదానం

మరికల్: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 2000–21లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంచి మనసు చాటుకున్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ స మ్మేళనం నిర్వహించారు. ఈ క్రమంలో స్థానిక యువక మండలి భవనంలో ఎస్వీఎస్ వైద్యుల సహకారంతో పేదలకు ఉచిత వైద్యం అందించడంతో పాటు రక్తదాన శిబిరాలను నిర్వహించి ఆదర్శంగా నిలిచారు. అనంతరం తమకు విద్య బోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించి ఆనాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

మద్దూరు: మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాల అవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరి గురించి ఒకరు తెలుసుకొని అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాకేష్, మల్లప్ప, మహిపాల్, చందు, సిద్ధు, తిరుపతి, నర్మద, కల్పన, శివనందా, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇరుకు రోడ్లతో తప్పని ఇబ్బందులు



వర్కూర్ సమీపంలో వెళ్తున్న భారీ లారీ

మాగనూర్: మండలంలోని వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి, కొత్తపల్లి, మందిపల్లి, వడ్వాట్, అడవిసత్యావర్, కోల్పూర్ గ్రామాలకు వెళ్లే రోడ్లు ఇరుకుగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లు ఇరుకుగా మారడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే రివర్స్ చేయాలని పరిస్థితి నెలకొంది. ఇరుకు రోడ్లతో తరచూ ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రెండు పెద్ద వాహనాలు (బస్సులు, లారీలు, ట్రాక్టర్లు) వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి గ్రామీణ రోడ్లపై దృష్టి సారించి రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'మన్‌కీ బాత్'ను వీక్షించిన బీజేపీ నాయకులు

ధన్వాడ: ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ధన్వాడ మండల కేంద్రంలోని మాజీ వైస్‌ఎంపీపీ రాంచంద్రయ్య ఇంట్లో 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్‌యాదవ్, మండల అధ్యక్షుడు శివరాజ్, నర్సింములు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

ఊట్కూరు: ఊట్కూరులోని స్థానిక శిశుమందిర్‌లో సోమవారం ఉదయం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని రాష్ట్ర, జిల్లా, బూత్ స్థాయి నాయకులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. సమావేశానికి రాష్ట్ర ముఖ్యనాయకులు విచ్చేస్తారని, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ధార్యానాయక్ మృతి పై సంతాపం

కొత్తపల్లి: మండలంలోని శివాలయ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించిన ధార్యానాయక్ (68) మృతి చెందారు. దివ్యాంగుడు, కుష్టు వ్యాధిగ్రస్తుడైన ధార్యానాయక్ భిక్షాటన చేసి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో 8 గుంటల భూమిని కొనుగోలు చేశారు. అయితే అక్కడ ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలియడంతో తన భూమిని ఉచితంగా ఇవ్వడంతో పాటు నగదు సాయం కూడా చేశారు. అయితే గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ధార్యానాయక్ ఆదివారం మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

16న 'యుగమానోత్సవం'



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న వీరసేవ సమాజం సభ్యులు

నారాయణపేట రూరల్: మహాత్మా బసవేశ్వర జయంత్యోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ పట్టణంలో జూన్ 16న ఆది జగద్గురు పంచాచార్య యుగమానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారని వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను పట్టణంలోని శివలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ జూన్ 16న పాలమూరు వాసవీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఉజ్జయిని, కాశి, శ్రీశైల క్షేత్ర ఆది జగద్గురులు హాజరవుతున్నారని తెలిపారు. నారాయణపేట జిల్లా వీరశైవ సమాజం సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని, గురువుల ఆశీర్వాదం పొందాలని కోరారు. కార్యక్రమంలో సమాజం సభ్యులు అవుటి రవికుమార్, మల్లికార్జున్, నాగభూషణం, గందే రవికాంత్, రఘుబాబు, అరకంచి రవికుమార్, ఆకుల రాజేష్ కుమార్, సులిగెం సురేష్, శివకుమార్, శ్రవణ్ పాల్గొన్నారు.

రైతు ఉద్యమాలు బలోపేతం చేయాలి



నూతన కమిటీ సభ్యులతో ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్

అమరచింత: వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో పంటలు వేసుకునే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, రైతాంగ ఉద్యమాలను బలోపేతం చేయడానికి రైతులు సంఘటితంగా ఉండాలని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి వెంకటేష్ అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఏఐకేఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీ విత్తనాలు, పరికరాలు ఇవ్వాలని, కొనుగోలు చేసిన వడ్లకు డబ్బులు రైతుల ఖాతాలో జమ చేస్తూ బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు నెలకొరిగిన మామిడి తోట రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు సైతం ప్రభుత్వం ఆదుకోవాలని, పెట్టుబడి సాయం అందించాలన్నారు. అనంతరం ఏఐకేఎస్ నూతన కమిటీని 11 మందితో ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో మోహన్, శంకర్, నాగరాజు, రాజు, మహేష్, అనంతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న ఎంపీ డీకే అరుణ

ధన్వాడ: మండలంలోని కొండాపూర్‌లో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన, శికరం ప్రారంభోత్సవం, సుబ్రహ్మణ్యస్వామి ప్రతిష్ఠ, అంజనేయస్వామి కవచం ఏర్పాటు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాలకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రతంగ్‌పాండురెడ్డి, నాగురావు నామాజీ, విమల అంజియాదవ్, రఘువీర్‌యాదవ్, శేఖర్‌రెడ్డి, నారాయణ, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కోయిల్‌కొండ: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.శివకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గార్లపహాడ్ గేట్ వద్ద ఏర్పాటుచేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ ఏడాది నియోజక వర్గానికి 3,500 ఇళ్లు మంజూరు కాగా.. పార్టీలకు అతీతంగా అర్హుల ఎంపికను పారదర్శకంగా చేపడుతున్నట్లు వివరించారు. అదే విధంగా నిరుద్యోగ యువతను స్వయం ఉపాధిలో ప్రోత్సహించేందుకు రాజీవ్ యువవికాసం పథకం కింద రాయితీపై రుణాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అందుకు సంబంధించి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు ఆయన సూచించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.రవీందర్, నాయకులు నరేశ్ గౌడ్, యాదయ్య, రామస్వామి, యునూస్ అలీ, మహమ్మద్, మడుగు వెంకటయ్య ఉన్నారు.

వాహనం ఢీ .. మహిళకు తీవ్రగాయాలు

కోస్గి రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు తీవ్రగాయాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు మండల పరిధిలోని నాచారం గ్రామానికి చెందిన మెతుకు చంద్రయ్య అనారోగ్యానికి గురి కావడంతో పట్టణంలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం మెతుకు చంద్రయ్య భార్య మెతుకు పార్వతమ్మ పాల కోసం బస్టాండ్‌కు వెళ్తుండగా సాయిబాబా ఆలయ సమీపంలో గుర్తు తెలియని ఓ ద్విచక్రవాహనం బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో పార్వతమ్మ తలకు తీవ్రగాయాలు కాగా కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పాలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

గుంతల రోడ్లతో అవస్థలు

- రోడ్లను ఆక్రమించిన ముళ్లపొదలు
- పట్టించుకోని అధికారులు



ప్రధాన రహదారిపైకి వాలిన ముళ్లపొదలు



మెట్టుగడ్డ సమీపంలో అధ్వానంగా రోడ్డు

దామరగిద్ద: మండలంలోని ప్రధాన రహదారులు నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు రహదారులను ఆక్రమించడం, పలు చోట్ల వర్షం నీరు నిలిచి గుంతలమయం కావడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రమైన నారాయణపేట వరకు 10 కిలోమీటర్లు, దామరగిద్ద నుంచి కర్ణాటక అంతర్రాష్ట్ర రహదారి అయిన యానుగుంది వరకు పలు చోట్ల రోడ్లపై గుంతలు, మలపుల దగ్గర ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పర్యవేక్షణ కరవు

ఏటా రోడ్ల నిర్వహణ చేపట్టాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు నిధుల కేటాయింపు లేదంటూ పట్టించుకోకపోవడంతో ప్రధాన రదారులను ముళ్ల చెట్లు ఆక్రమించడంతో రహదారులు ఇరుకుగా మారాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ముళ్ల కంపలు తగిలి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి దామరగిద్ద రహదారిలో కొండారెడ్డిపల్లి రెవెన్యూ శివారులో, మెట్టుగడ్డ ప్రాంతంలో రోడ్డుపై ఇసుక మేటలు వేసింది. అలాగే దామరగిద్ద నుంచి మద్దూర్ వరకు 12 కిలోమీటర్ల రహదారిలో పలు చోట్ల రోడ్డుపై ముళ్ల పొదలు, కంపచెట్లు వాలిపోయాయి. కాన్‌కుర్తి నుంచి మల్‌రెడ్డిపల్లి మీదుగా లోకూర్తి వెళ్లేదారిలో కాన్‌కుర్తి శివారులో రోడ్డుపై మురికితుమ్మ చెట్లు రోడ్డుపైకి వాలడంతో రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనాలు ఎదురెదురుగా దాటె సమయంలో కంపచెట్లు తగులుతున్నాయని వాహనాదారులు వాపోతున్నారు.

వారం రోజుల్లో మరమ్మతు చేపడతాం



రహదారికి ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి రోడ్డును ఆక్రమించిన మాట వాస్తవమే. మద్దూర్ నుంచి దామరగిద్ద మీదుగా నారాయణపేట వరకు ఫోర్‌లైన్ రహదారి నిర్మాణం పనుల్లో భాగంగా వారం రోజుల్లో జంగిల్ కటింగ్ పనులు ప్రారంభిస్తాం. గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– రాములు, డీఈ, ఆర్అండ్‌బీ